بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ     وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 13.12.2019 (Telugu)**

## ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప అభిమాని అయిన అనుచరుల సద్గుణముల విశ్వాసభరిత ప్రస్తావన

### హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 13.12.2019 తేదీన - మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. గత ఖుత్బాలో నేను హజ్రత్ హిలాల్ బిన్ ఉమయ్యహ్ గురించి ప్రస్తావించియుంటిని. తబూక్ యుద్ధములో పాల్గొనలేక పోయిన ముగ్గురు అనుచరులలో ఒకరు హజ్రత్ హిలాల్. యుద్ధము నుండి తిరిగి వచ్చిన తరువాత ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ముగ్గురిపై తమ అసంతృప్తిని వ్యక్తపరచి, కొంత శిక్షించిరి కూడ. అందుకు వీరు ముగ్గురు ఎంతో కలత చెందిరి. అల్లాహ్ తఆలా ఆస్థానములో మోకరిల్లుచు, పశ్చాత్తాపపడుచు, క్షమాపణలు కోరిరి. ఈ ముగ్గురు అనుచరుల రోధనను చివరికి అల్లాహ్ తఆలా ఆమోదించెను. వీరిలో హజ్రత్ హిలాల్ వుండిరి. వీరి క్షమాపణ గురించి అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో సూక్తిని అవతరింపజేసెను. హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇదే విషయము గురించి మరి కొన్ని విషయములున్నవి. వాటిని నేనిప్పుడు ప్రస్తావింతును.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వెంట వెళ్ళుటకు సిద్ధముగా లేని వారిలో ఒక వ్యక్తి జద్ బిన్ ఖైస్ కూడ వుండెను. రోమియోలతో యుద్ధము చేయుటకు నువ్వు మా వంట వెళ్ళవా? అని అతనిని వారు సల్లల్లాహు అలైహి వసల్లం ప్రశ్నించగా అతడు ఇట్లు సాకు తెలిపెను. స్త్రీల వలన నేను మోసపోయే అవకాశమున్నది. మహిళలున్నారు, కుటుంబ బాధ్యతలున్నవి. ఇంకొన్ని సమస్యలున్నవి. కావున నన్ను ఆపదలో పడవేయకూడదు. కావున వారు అతనిని విడిచిపెట్టి, అతనికి అనుమతిచ్చిరి. అప్పుడు అల్లాహ్ తఆలా ఈ సూక్తి అవతరింపజేసెను. - - - (అత్తౌబహ్:49) అనగా వారిలో కొందరు దాంబికులు ఇట్లందురు. మాకు వెనుక వుండిపోవుటకు అనుమతించుము. మాకు యుద్ధ రంగములో పాల్గొను పరీక్షలో వేయకుము. వీరు పూర్వము నుండే పీడనములో వున్నవారని బాగుగా వినుము. నరకము అవిశ్వాసులను నిశ్చయముగా నాశనమొనర్చును.

మదీనాలో సీరియా వైపు అబుల్ బిన్ తైహాన్ వారి బావి వుండెను. దాని నీళ్ళు తియ్యగా వుండేవి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ దాని నీటిని త్రాగి, ఇష్ట పడిరి. ఆ యూదుని ఇల్లు దాంబికులకు అడ్డాగా మారెను. దాంబికులు అక్కడ సమావేశమగుచున్నారని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు సమాచారమందినది. వారు తబూక్ యుద్ధములో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనకుండా ప్రజలను నిలువరిస్తున్నారు. నువ్వు వారి వద్దకు వెళ్ళి వారు మాట్లాడిన ఈ విషయములను గురించి వారిని ప్రశ్నించుమని అమ్మార్ బిన్ యాసిర్‌ను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. వారు నిరాకరించినచో మీరు ఇటువంటి విషయములు మాట్లాడారని నాకు తెలిసిందని తెలుపండి. హజ్రత్ అమ్మార్ అక్కడికి చేరుకొని వారికీ విషయములు తెలుపగా వారు సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి వారు క్షమాపణలు కోరిరి.

అప్పటి పరిస్థితులు ఇట్లుండెను. బయలు దేరుటకు ముందే వెళ్ళకూడదని ప్రణాళికలు రచించుచుండిరి. దాంబికులు వారిలో చేరిరి. కొందరు అలాగే సాకులు వెతికిరి. మరికొందరు తర్వాత సాకులు తెలిపిరి. అనగా తిరిగి వచ్చిన తర్వాత ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి సాకులు చెప్పిరి. వారి విషయమును వారు సల్లం అల్లాహ్ తఆలాకు అప్పగించిరి.

ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏదేని ప్రయాణము ముగించుకొని మదీనాకు వచ్చేటప్పుడు మొదట మస్జిద్‌నకు చేరుకొని రెండు రకాతులు నమాజ్ చేదివేవారు. కావున వారు తబూక్ నుండి తిరిగి వచ్చినప్పుడు మదీనాలో ఉదయం పొద్దెక్కిన తర్వాత ప్రవేశించిరి. కనుక మొదట మస్జిద్‌లో రెండు రకాతుల నమాజ్ చదివిరి.

నమాజ్ తర్వాత ప్రజలతో మాట్లాడుటకు వారు మస్జిద్‌లో ఆగిపోయిరి. ఉద్దేశపూర్వకంగా పాల్గొని వారు కూడ వారిని కలిసేందుకు వచ్చిరి. వారు వారి ముందు ఏదో ఒక సాకు తెలిపేవారు. ఇటువంటి వారి సంఖ్య 80 వరకుండెను. వారు సల్లల్లాహు అలైహి వసల్లం వారి బాహ్య సాకులను విని ఆమోదించేవారు. వారి బైఅత్ తీసుకునేవారు. వారి కొరకు క్షమాపణ యాచించేవారు. కాని ఇంతకు ముందు వివరంగా తెలిపినట్లు హజ్రత్ హిలాల్ బిన్ ఉమయ్యహ్, హజ్రత్ మురారహ్ బిన్ రబీ, హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ ఎలాంటి బూటకపు సాకు చెప్పలేదు. కావున వారు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అసంతృప్తిని సహించవలసి వచ్చెను. చాలా రోధించిరి, వినయము వహించిరి. అల్లాహ్ తఆలా ఆస్థానములో క్షమాపణలు యాచించిరి, మొకరిల్లిరి. అనంతరం వారి క్షమాపణను ఆమోదించినట్లు అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో కూడ ప్రకటించెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ప్రస్తావించబడనున్న రెండవ అనుచరుల పేరు హజ్రత్ మురారహ్ బిన్ రబీ ఆమిరీ. హజ్రత్ మురారహ్ బిన్ రబీ ఆమిరీ అన్సార్ తెగ ఔస్ వంశమైన బనూ ఆమర్ బిన్ ఔఫ్‌నకు చెందిన వారు. బదర్ యుద్ధములో పాల్గొను అనుగ్రహము హజ్రత్ మురారహ్ బిన్ రబీ ఆమిరీకి లభించినది. బుఖారి, అనుచరుల చరిత్ర సంఘటనలలో వీరు బదర్ యుద్ధములో పాల్గొన్న ప్రస్తావన గలదు. ఇంతకు ముందు ప్రస్తావించబడినట్లు తబూక్ యుద్ధములో పాల్గొనని ముగ్గురు అనుచరులలో వీరు కూడ ఒకరు. కావున ఈ విషయము గురించి హజ్రత్ మురారహ్ ప్రస్తావన విడిగా లేదు. హజ్రత్ హిలాల్ బిన్ ఉమయ్యహ్ గురించి హజ్రత్ కాబ్ బిన్ మాలిక్ తెలిపిన వివరములే వున్నవి. వాటిని నేను గత ఖుత్బాలో ప్రస్తావించితిని.

ప్రస్తావించబడనున్న మరో అనుచరుని పేరు అత్బ బిన్ ఘజ్వాన్. హజ్రత్ అత్బ స్వయముగా ఇట్లు తెలిపిరి. మొట్ట మొదట ఇస్లాం స్వీకరించి, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసిన మొదటి ఏడుగురులలో నేను కూడ ఒకడిని. ఇబ్నె అసిర్ ప్రకారము హజ్రత్ అత్బ ఎబిసీనియా వైపు ప్రస్థానము చేసినప్పుడు వారి వయసు 40 సం॥లు వుండెను. వారు ఎబిసీనియా నుండి మక్కాకు తిరిగి వచ్చినప్పుడు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అప్పటికి మక్కాలో నివాసముండిరి. అనంతరం వారు హజ్రత్ మిఖ్దాద్‌తో కలిసి మదీనాకు ప్రస్థానము చేసిరి.

ఖడ్గ యుద్ధమునకు అనుమతించు పవిత్ర ఖుర్ఆన్ మొదటి సూక్తి హిజ్రి 2వ సం॥ సిఫర్‌లో నెలలో 12వ తేదీన ఆవతరించెను. అవిశ్వాసుల దాడి నుండి ముస్లిములను రక్షించుటకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నాలుగు ప్రణాళికలు రచించిరని చరిత్ర ద్వారా తెలుస్తున్నది. అవి వారి గొప్ప రాజకీయ ప్రతిభ, యుద్ధము దూరదృష్టికి నిదర్శనము. ఆ ప్రణాళికలు ఇట్లు గలవు.

ఒకటి: వారు స్వయముగా ప్రయాణించి చుట్టు ప్రక్కల తెగలతో పరస్పరం చర్చించి శాంతి ఒప్పందములు కుదుర్చుకొనడం మొదలు పెట్టిరి. తద్వారా మదీనా చుట్టు గల ప్రాంతముల వలన ప్రమాదము జరిగే అవకాశము లేకుండెను.

రెండవది: సమాచారము తెలుసుకొనుటకు, నిఘా పెట్టుటకు చిన్న చిన్న బృందములను విభిన్న ప్రాంతములకు పంపడం మొదలు పెట్టిరి. తద్వారా వారికి ఖురైషీల, వారి మిత్ర పక్షముల కదలికల గురించి తెలిసేది. ముస్లిములు నిర్లక్ష్యములో లేరని ఖురైషీలకు కూడ తెలిసేది. ఈ విధంగా మదీనాపై అకస్మాత్తుగా దాడి జరిగి అవకాశము లేకుండెను.

మూడవది: ఈ బృందములను పంపుటలో దాగి వున్న మరో విషయమేమనగా చుట్టు ప్రక్కల నివాసముంటున్న బలహీన ముస్లిములు సైతం మదీనాకు వచ్చి ముస్లిములతో కలిసి పోయే అవకాశముండెను. ఇటువంటి వారికి క్రూర జాతి నుండి మోక్షము లభించును. అనగా ఇటువంటి వారు ఖురైషీల బృందములతో కలిసి మదీనాకు సమీపములో చేరుకొని, అవకాశము లభించినప్పుడు పారిపోయి ముస్లిము బృందములలో కలిసిపోయేవారు.

నాలుగవది: మక్కా నుండి సీరియాకు ప్రయాణించే ఖురైషీల వ్యాపార బృందములను నిలువరించసాగిరి. ఎందుకనగా ఈ బృందములు ప్రయాణిస్తు మార్గములో వున్నటువంటి తెగలను ముస్లిములకు విరుద్ధముగా రెచ్చగొట్టే వారు.

మరో విషయమేమనగా ఈ బృందములు ఎల్లప్పుడు ఆయుధములు ధరించి వుండేవి. ఇటువంటి బృందములు మదీనాకు సమీపములో ప్రయాణించుట ప్రమాదమునకు ఒక సూచిక అని అందరికి తెలిసినదే. మూడవ విషయమేమనగా ఖురైష్‌ల ప్రధాన ఆదాయము వ్యాపారముపైనే ఆధారపడి వుండెను. ఖురైషీలను ఓడించుటకు, వారి క్రూర చర్యల నుండి వారిని నిలువరించుటకు, వారిని శాంతికి ఒప్పించుటకు వారి వ్యాపార మార్గము మూసివేయుట అత్యంత ముఖ్యమైన, ప్రభావశాలి విషయము. తుదకు శాంతి ఒప్పందమునకు ఖురైషీలను ఒప్పించిన విషయములలో అతి ముఖ్యమైన విషయము వారి వ్యాపార బృందములను నిలువరించుటయే అని చరిత్ర ద్వారా తెలుస్తున్నది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ అత్బ బిన్ ఘజ్వాన్ మదీనాకు వలస పోయిన సంఘటన ఇట్లుండెను. హిజ్రి రెండవ సం॥ రబీవుల్ అవ్వల్ నెల ఆరంభములో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఒక సమీప బంధువు ఉబైద్ బనిల్ హారిస్ మత్లబీ నాయకత్వములో ముహాజిర్ల ఒక సైన్య బృందమును పంపిరి. వీరు సనియ్యతుల్ మిర్అకు చేరుకున్నప్పుడు ఆయుధములు ధరించిన ఖురైషీల రెండు వందల నవయువకులు ఇక్రమ బిన్ అబూజహల్ నాయకత్వములో విడిది చేసుకొనికి వుండిరి. ఇద్దరు పరస్పరం తారస పడిరి. ముస్లిముల వెనుక వారి సహాయమునకు ఇంకా కొందరుండవచ్చుననే అనుమానముతో అన్యారాధకులు అక్కడి నుండి పారిపోయిరి. అన్యారాధకుల బృందము నుండి ఇద్దరు వ్యక్తులు అనగా మిఖ్దాద్ బిన్ అమర్, అత్బ బిన్ ఘజ్వాన్ వచ్చి ముస్లిములలో కలిసి పోయిరి. వారు మనసులో ఇస్లాం స్వీకరించినను బలహీనత వలన ఖురైషీలతో భయపడుచు ప్రస్థానము చేయలేకపోతుండిరి. ముస్లిములు జాగరూకులుగా వున్నారని, తమలోని కొందరు వ్యక్తులు వల్లి ముస్లిములతో కలుస్తున్నారని చూసి అన్యారాధకులు ముస్లిములతో యుద్ధము చేయుటకు సాహసించలేక పోయిరి. ఇది అల్లాహ్ తఆలా శుభము.

హజ్రత్ అత్బ బిన్ ఘజ్వాన్, వారు స్వాతంత్ర్యమిచ్చిన బానిస హబ్బాబ్ మక్కా నుండి మదీనాకు ప్రస్థానము చేసినప్పుడు తబ్ఖాతుల్ కుబ్రాలోని ఒక కథనము ప్రకారము ఖబా ప్రాంతములో వారు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సల్మా అజ్లాని వద్ద నివాసముండిరి. అనంతరం హజ్రత్ అత్బ మదీనాకు చేరుకున్నప్పుడు వారు హజ్రత్ ఇబాద్ బిన్ బషర్ వద్ద నివాసముండిరి. హజ్రత్ అత్బ బిన్ ఘజ్వాన్ మరియు హజ్రత్ అబూదజానా మధ్య రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సోదర సంబంధము కుదిర్చిరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. హజ్రత్ అత్బ బిన్ ఘజ్వాన్ గురించి మరి కొన్ని విషయములున్నవి. వాటిని నేను ఇన్‌షాఅల్లాహ్ వచ్చే ఖుత్బాలో ప్రస్తావింతును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇప్పుడు నేనొక ప్రకటన చేయదలచితిని. మేము దినపత్రిక అల్‌ఫజల్ వెబ్ సైట్ ప్రారంభించినాము. అల్‌ఫజల్‌కు 106 సం॥లు పూర్తి అయిన సందర్భమున లండన్ నుండి అల్‌ఫజల్ ఆన్‌లైన్ ఎడీషన్ మొదలైనది. ఈ పత్రికను నేటికి 106 సం॥ల క్రితం హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు గారు హజ్రత్ ఖలీఫతుల్ మసీహిల్ అవ్వల్ రజియల్లాహు అన్‌హు అనుమతి, ప్రార్థనలతో 18 జూన్ 1913 తేదీన ప్రపారంభించిరి. పాకిస్తాన్ ఏర్పడిన తర్వాత కొంత కాలము వరకు లాహోర్ నుండి ముద్రించబడినది. అనంతరం హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు నాయకత్వములో ఇది రబ్వా నుండి వెలువడడం మొదలైనది. ఈ ప్రాచీన దిన పత్రిక అల్‌ఫజల్ ఆన్‌లైన్ ఎడిషన్ 13 డిసంబర్ 2019 నుండి పునఃప్రారంభగుచున్నది. ఇది ఇంటర్నెట్ ద్వారా ప్రపంచములోని ప్రతి చోట ఎంతో సులభంగా లభ్యమగును జుమా తర్వాత దిని ప్రారంభోత్సవము జరుగును. ఇన్ షాఅల్లాహ్.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇద్దరు మృతుల జనాజ నమాజ్ నేను చదివింతును. ఇన్ షాఅల్లాహ్. వీరిలో మొదటి జనాజ గౌ॥ కీ॥ శే॥ మిర్జా హఫీజ్ అహ్మద్ గారి సతీమణి గౌ॥ సయ్యదహ్ తన్వీరుల్ ఇస్లాం గారిది. 7 డిసంబర్ తేదీన 91 సం॥ల వయసులో వీరు మృతి చెందిరి. انا للہ وانا الیہ راجعون అల్లాహ్ తఆలా కృపానుసారము వీరు వసియ్యత్ చేసి వుండిరి. వీరి తండ్రి పేరు మీర్ అబ్దుస్సలాం. మృతురాలు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చిరకాల వినయులైన అనుచరులు హజ్రత్ మీర్ హుసాముద్దీన్ మునిమనువరాలు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు తఆలా అన్‌హు కోడలు. 1928 సం॥లో సియాల్కోట్‌లో జన్మించిరి. జనవరి 1948

లో వీరి వివాహము మిర్జా హఫీజ్ అహ్మద్ గారితో జరిగెను. ఈ విధంగా వీరు హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు తఆలా అన్హు కోడలైరి. 1956 సం॥ నుండి 2008 సం॥ వరకు వీరు వివిధ సమయములలో సుమారు 48 సం॥లు కేంద్ర లజ్న ప్రదర్శన కార్యదర్శిగా సేవలందించిరి. హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు తఆలా అన్హుతో వీరికి చాలా ప్రేమ పూర్వక సంబంధముండెను. తహజ్జుద్ పట్ల చాలా శ్రద్ధ చూపేవారు. వారు మృతి చెందిన రాత్రి కూడ మూడు గం॥లకు సమీపములో వారు తహజ్జుద్ నమాజ్ చదివి, నిద్ర పోయిరని వారి సేవకురాలు తెలిపెను. ఇదే స్థితిలో వారు మృతి చెందిరి. అల్లాహ్ తఆలా వారిని క్షమించి, కరుణించి, వారి స్థాయి అంతస్థులను పెంచుగాక!

రెండవ జనాజ కీ॥ శే॥ సిస్టర్ హాజ షకూరహ్ నూరియా అమెరికా గారిది. వీరు డిసంబర్ ఒటకవ తేదీన తుది శ్వాస వడిచిరి. انا للہ وانا الیہ راجعون వీరు 1927 సం॥లో జన్మించిరి. బాల్యము వాషింగ్టన్ డి.సి.లో గడిపిరి. 1979 సం॥లో వీరొక స్వప్నములో పవిత్ర ఖుర్ఆన్ ఒక ప్రతిని, షహాదత్ కలిమాను చూచిరి. అనంతరం ఇస్లాం, అహ్మదియ్యత్ మాత్రమే నిజమైన ధర్మమని వారికి నమ్మకము కలిగెను. కావున వారు బైఅత్ చేసిరి. వారికి ఖిలాఫత్ పట్ల అమిత గౌరవము, గాఢమైన సంబంధముండెను. బా జమాఅత్ నమాజ్‌నకు బద్ధులై వుండిరి. అల్లాహ్ తఆలా వారిని క్షమించి, కరుణించి, వారి స్థాయి అంతస్థులను పెంచుగాక! ఈ విధమైన సేవా దృక్పథము కలిగిన, వినయము, విధేయతలో లీనమైన వారిని అల్లాహ్ తఆలా జమాఅత్‌నకు నొసంగుచుండుగాక!

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
|---|---|
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |